రిపోర్టర్లు కావలెను
పత్రిక ప్రారంభించిన అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన క్విక్ టుడే తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రిపోర్టర్లు కావలెను.
అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం
మరిన్ని వివరాలకు సంప్రదించగలరు
8125972476
క్విక్ టుడే

quicktodaynews.com RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

QUICK TODAY DAILY దినపత్రిక

EDITOR : GILLALA BUCHI REDDY. 8125972476 | మల్కాజిగిరి | సంపుటి : 2 | సంచిక 324 | సోమవారం 18 ఆగస్టు 2025 | వెల : 3 రూ/.. | పేజీలు - 8



## నవీన్ పట్నాయక్‌కు అనారోగ్యం

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఒడిశా మాజీ సీఎం

5



# బీజేపీతో ఈసీ కుమ్మక్కు

**ఓట్ల చోరీకి పాల్పడుతున్న ఎన్నికల సంఘం**

**కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ**

**బిహార్‌లో 'ఓటర్ అధికార్ యాత్ర' ప్రారంభం**

**పాట్నా, ఆగస్టు17 (క్విక్ టుడే న్యూస్):**

బీజేపీతో కుమ్మక్కై ఓట్లను భారత ఎన్నికల సంఘం (ఈసీ) దొంగిలిస్తోందనీ యావత్ దేశానికి ఇప్పుడు తెలుసని లోక్‌సభ విపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఈ కుట్రలో వాళ్లను ఇండియా కూటమి నెగ్గనివ్వదని ఆయన స్పష్టం చేశారు. 'ఓటరు జాబితా సమగ్ర సవరణ' (SIR) ద్వారా ఓటరు జాబితాల్లోకి ఓటర్లను కలిపి, తీసివేసి బిహార్ అసెంబ్లీ ఎన్నికలనూ తస్కరించాలని ఈసీ, బీజేపీ కుట్ర పన్నాయని ఆయన వ్యాఖ్యానించారు. బిహార్‌లోని 20 జిల్లాల్లో 1,300 కి.మీ పరిధిలో ఆయన 'ఓటర్ అధికార్ యాత్ర'ను చేయనున్నారు. ఆదివారం ఈ యాత్ర ప్రారంభోత్సవం సందర్భంగా బిహార్‌లోని ససారంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేత ప్రసంగించారు. బిహార్‌లో ఓట్ల చోరీకి పాల్పడేందుకు వాళ్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశాన్ని ఇవ్వబోమని రాహుల్ గాంధీ అన్నారు. పేదల చేతిలో ఉన్న ఏకైక శక్తి ఓటుహక్కు మాత్రమేనని, దాన్ని పేదలకు దూరం కాకుండా చూస్తామని ప్రకటించారు. భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేందుకు ఆర్ఎస్ఎస్, బీజేపీ యత్నిస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకే 'ఓటర్ అధికార్ యాత్ర'ను ప్రారంభించామని వెల్లడించారు. యావత్ దేశంలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఓట్ల చోరీ జరిగిందన్నారు.

## ఈసీపై నిరాధార ఆరోపణలు



**ఎస్ఐఆర్ పై రాహుల్ తప్పుడు ప్రచారం**

**బిహార్ ఓటర్ల జాబితాలోని లోపాలను తొలగించడమే లక్ష్యం**

**ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్**

**పాట్నా, ఆగస్టు17:**

బిహార్ ఓటర్ల జాబితాలోని లోపాలను తొలగించడమే లక్ష్యంగా 'ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ' (ఎస్ఐఆర్) చేపట్టామని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అన్నారు. అయితే కొన్ని పార్టీలు దాని గురించి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నాయని, ఇది తీవ్ర ఆందోళనకరమైన విషయమని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి బిహార్‌లో ఓటు చోరీకి వ్యతిరేకంగా 'ఓటర్ ఆధికార్ యాత్ర' చేపట్టిన నేపథ్యంలో సీఈసీ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. విలేకరుల సమావేశంలో మాట్లాడిన సీఈసీ జ్ఞానేశ్ కుమార్ మాట్లాడారు. చట్టాలను ఈసీ ఎప్పుడూ గౌరవిస్తుందని, పార్టీల మధ్య ఎలాంటి వివక్ష చూపించలేదన్నారు. అన్ని పార్టీలు కూడా ఎస్ఐఆర్ విధానంలో

మిగతా 5లో



## రాజగోపాల్ రెడ్డిపై వేటు?

**నేడు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ భేటీ**

**హైదరాబాద్, ఆగస్టు17 (క్విక్ టుడే న్యూస్):**

ఇటీవల సీఎం రేవంత్ రెడ్డిపై పదే పదే ఆరోపణలు చేస్తున్న మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిపై తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చర్యలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది. తనకు మంత్రి పదవి ఇవ్వాలని రాజగోపాల్ రెడ్డి గత కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో రేవంత్ రెడ్డిపై పలుసార్లు ఆరోపణలు చేశారు. ఈక్రమంలో ఈ రోజు టీపీసీసీ(తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ) క్రమశిక్షణ కమిటీ భేటీ జరగనుంది. కమిటీ చైర్మన్ మల్లు రవి అధ్యక్షతన హైదరాబాద్‌లో జరిగే ఈ సమావేశంలో ప్రధానంగా రాజగోపాల్‌రెడ్డి అంశం పైనే చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాజగోపాల్ రెడ్డి అంశంతో పాటు ఇటీవల రాష్ట్ర కాంగ్రెస్‌లో జరుగుతున్న అంతర్గత కలహాల గురించి కూడా కమిటీ చర్చించనుంది. మిగిలిన గొడవల విషయంలో నోటీసులు, వార్నింగ్‌లు ఇచ్చినా..కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై మాత్రం చర్య తీసుకునే అవకాశం కనిపిస్తోంది. అదే సమయంలో, కొండా మురళి అంశం కూడా చర్చకు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. రాజగోపాల్ రెడ్డి బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరితే మంత్రి పదవి ఇస్తామని పార్టీ పెద్దలు చెప్పారని, కానీ మాట తప్పారని రాజగోపాల్ రెడ్డి పదేపదే ఆరోపిస్తున్నారు. అయితే ఆయనకు హామీ ఇచ్చిన విషయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యలు వేర్వేరుగా ఉండటం కూడా నేటి సమావేశంలో చర్చకు వచ్చే అవకాశం ఉంది. తనకు మంత్రి పదవి ఇవ్వడం లేదని రాజ్ గోపాల్ రెడ్డి పార్టీ నాయకులు, ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యల్ని కమిటీ సీరియస్‌గా తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. కొంతకాలంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టార్గెట్‌గా చేసుకుని కోమటిడ్డి రాజగోపాల్ రెడ్డి వరుస విమర్శలు చేస్తున్నారు. రాజగోపాల్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు

మిగతా 5లో

## కాళేశ్వరంపై మరో కుట్ర

**రోజూ మోటార్లను ఆన్, ఆఫ్ చేస్తున్నారు**

**బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు**



**హైదరాబాద్, ఆగస్టు17 (క్విక్ టుడే న్యూస్):**

కాళేశ్వరం పై కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకొక కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మోటర్లను కావాలని ఆన్, ఆఫ్ చేస్తున్నారు.. రోజూ ఇలా చేస్తే మోటర్లు పాడవుతాయని బీహెచ్ఈఎల్ హెచ్చరించిందన్నారు.. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆదివారం ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పై మరో కుట్రపన్నుతున్నారని ఆరోపించారు. సిద్దిపేటలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తన రాజకీయాల కోసం రైతుల మీద పగ ప్రతికారాలు తీర్చుకుంటుందని

మిగతా 5లో



## స్వదేశానికి చేరుకున్న శుభాంశు శుక్లా

**పెద్ద సంఖ్యలో ఘన స్వాగతం**

**న్యూఢిల్లీ, ఆగస్టు17:**

యాక్సియం-4 మిషన్‌తో భారత రోదసి చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న భారత వైమానిక దళ గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా స్వదేశానికి తిరిగి వచ్చారు. అంతరిక్ష

మిగతా 5లో

## ఎన్‌డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా రాధాకృష్ణన్

**బీజేపీ పార్లమెంటరీ బోర్డు ప్రకటన**

**తమిళనాడుకు చెందిన సీనియర్ నేతకు అవకాశం**



**న్యూఢిల్లీ, ఆగస్టు17:**

ఎన్‌డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా తమిళనాడు బీజేపీ సీనియర్ నేత సీపీ రాధాకృష్ణన్‌ను నియామించినట్లు బీజేపీ పార్లమెంటరీ బోర్డు ప్రకటించింది. ప్రస్తుతం రాధాకృష్ణన్ మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్నారు. గతంలో ఆయన ఝార్ఖండ్ గవర్నర్‌గా పనిచేశారు. తెలంగాణకు ఇన్‌చార్జి గవర్నర్‌గా, కోయంబత్తూర్ నుంచి రెండుసార్లు ఎంపీగా

మిగతా 5లో

## దీపావళికి డబుల్ ధమాకా

**జీఎస్టీ సంస్కరణలు చేపడుతున్నాం**

**నాలుగు బదులు రెండు స్లాబుల సిస్టం**

**నిత్యావసరాలపై 5 శాతం, ఇతర వస్తువులపై 18 శాతం పన్ను ప్రతిపాదన**

**ఢిల్లీలో రెండు ప్రధాన రహదారులను ప్రారంభించిన ప్రధాని మోదీ**


5



## న్యూయార్క్‌లో కాల్పులు

**ముగ్గురు మృతి, మరో 8 మందికి తీవ్ర గాయాలు**

**బ్రూక్లిన్ నైట్‌క్లబ్‌లో కాల్పుల ఘటన**



**న్యయార్క్, ఆగస్టు17 (క్విక్ టుడే న్యూస్):**

అమెరికాలో మరోసారి కాల్పుల మోత మోగింది. న్యూయార్క్‌లోని బ్రూక్లిన్‌లో ఉన్న ఓ నైట్‌క్లబ్‌లో ఆదివారం తెల్లవారుజామున దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోగా, మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ దాడిలో పలువురు షూటర్లు

మిగతా 5లో

తరువాయి పేజీ..



## ఎన్‌డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా రాధాకృష్ణన్

ఎన్నికయ్యారు. 1957 మే 4న జన్మించిన సీపీ రాధాకృష్ణన్ తమిళనాడులోని కోయంబత్తూరు లోక్‌సభ స్థానం నుంచి 2సార్లు బీజేపీ తరుపున ఎంపీగా ఎన్నికయ్యారు. తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగానూ ఆయన సేవలు అందించారు. 2016 నుంచి 2019 వరకు ఆల్ ఇండియా కాయర్ బోర్డ్ ఛైర్మన్‌గా పనిచేశారు. ఈ విధంగా ఆయన తమిళనాడు బీజేపీ సీనియర్ నాయకుల్లో ఒకరిగా మంచి గుర్తింపు పొందారు. 2023 ఫిబ్రవరి 18 నుంచి ఝార్ఖండ్ గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన తెలంగాణతో పాటు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గానూ అదనపు బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా పని చేస్తున్నారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిని ఎంపిక చేసే అధికారాన్ని ఎన్‌డీఏ పక్షాలు ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాకు అప్పగించిన సంగతి తెలిసిందే. దీనితో వారు సీపీ రాధాకృష్ణన్‌ను తమ తరపున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నిలబెట్టాలని నిర్ణయించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికకు నామినేషన్ దాఖలుకు ఈ నెల 21 చివరి తేదీ కాగా సెప్టెంబర్ 9న ఎన్నిక జరుగనుంది.

## న్యూయార్క్‌లో కాల్పులు

పాల్గొన్నారని న్యూయార్క్ పోలీసులు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే, క్రౌన్ హైట్స్‌లోని ఫ్రాంక్లిన్ అవెన్యూలో ఉన్న 'టేస్ట్ ఆఫ్ ది సిటీ' అనే లాంజ్‌లో ఈ దారుణం చోటుచేసుకుంది. స్థానిక కాలమానం ప్రకారం తెల్లవారుజామున 3:27 గంటల సమయంలో ఈ కాల్పుల ఘటనపై తమకు సమాచారం అందిందని పోలీసులు తెలిపారు. లాంజ్‌లో జరిగిన ఓ చిన్న గొడవ చినికి చినికి గాలివానలా మారి కాల్పులకు దారితీసిందని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఘటనా స్థలం నుంచి పోలీసులు 36 బుల్లెట్ షెల్స్‌తో పాటు ఓ తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. ఈ కాల్పుల్లో మొత్తం 11 మంది బాధితులు కాగా, వారిలో ఎనిమిది మంది పురుషులు, ముగ్గురు మహిళలు ఉన్నారు. వీరి వయసు 27 నుంచి 61 సంవత్సరాల మధ్య ఉంటుందని అధికారులు తెలిపారు. మరణించిన ముగ్గురూ పురుషులేనని నిర్ధారించారు. గాయపడిన ఎనిమిది మందిని స్థానిక ఆసుపత్రులకు తరలించగా, వారి ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు.

## కాళేశ్వరంపై మరో కుట్ర

మండిపడ్డారు.. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీగా వరద వస్తోందని ఈ ప్రాజెక్టు గేట్లు ఎత్తి 62 వేల క్యూసెక్కుల వరదను వృథాగా సముద్రంలోకి వదులుతున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పంపులను ఆన్ చేసి రిజర్వాయర్లను నింపాలని డిమాండ్ చేశారు. నంది మేడారం పంప్ హౌస్ నుంచి మానేరుకు నీరు విడుదల చేసే అవకాశం ఉన్న చేయట్లేదు.. వారం రోజుల కిందట ఇదే అంశంపై ఉత్తమ్ కుమార్ రెడ్డికి లేఖ రాశాను.. మోటర్లు ఆన్ చేయమంటే పట్టించుకోలేదన్నారు. కావాలనే వారు కుట్రలు చేస్తున్నారు.. ఉత్తమ్, సీఎం మధ్య విభేదాలు ఉంటే మీరు మీరు చూసుకోండి.. కానీ మోటర్లు ఆన్ చేయకపోతే వేలాది మంది రైతులతో వెళ్లి మోటర్లు ఆన్ చేస్తాం.. నల్గొండలో మాధవరెడ్డి ప్రాజెక్టుపై కూడా ఇలానే చేస్తున్నారు.. 18 ఏళ్ల తర్వాత కృష్ణా నదిలో నీళ్లు వచ్చాయి.. అయినా ఇప్పటివరకు ఏ ఒక్క చెరువు కూడా నింపలేదు.. కల్వకుర్తి ప్రాజెక్టులో మూడు మోటర్లతో పంపింగ్ చేయాల్సి ఉంటే ఒకటే మోటార్ ఆన్ చేశారు.. వరంగల్ జిల్లాలో దేవాదుల విషయంలోనూ ఇలానే చేస్తున్నారు.. కమీషన్లు, పర్సెంటేజీలకు మాత్రమే మీకు సమయం సరిపోతుందా అని విమర్శించారు.

## నవీన్ పట్నాయక్‌కు అనారోగ్యం

### ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఒడిశా మాజీ సీఎం

**భువనేశ్వర్, ఆగస్టు17:**

ఒడిశా మాజీ ముఖ్యమంత్రి, బిజూ జనతాదళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ కొద్ది సేపటి క్రితం ఆస్పత్రిలో చేరారు. పెద్ద వయసుతో వచ్చిన అనారోగ్యాల కారణంగా ఆయన భువనేశ్వర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. శనివారం రాత్రి నుంచి తనకు అసౌకర్యంగా ఉందని పట్నాయక్ చెప్పారు. దీంతో పలువురు వైద్యులు ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారు అని నేతలు చెబుతున్నారు. ఆయన డీహైడ్రేషన్‌తో బాధపడుతున్నారని.. అయితే ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. చికిత్సకు స్పందిస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. ఇదిలా ఉండగా.. నవీన్ పట్నాయక్ ఇటీవల ముంబయిలో సర్వికల్ ఆర్థరైటిస్‌కు శస్త్రచికిత్స చేయించుకున్న విషయం తెలిసిందే.



# గణపతి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

### డీజేలకు అనుమతి లేదు

### మల్కాజిగిరి డివిజన్ ఏసీపీ చక్రపాణి




**మేడిపల్లి, ఆగస్టు17 (క్విక్ టుడే న్యూస్):**

గణపతి నవరాత్రుల ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని, ఎవరికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి డివిజన్ ఏసీపీ చక్రపాణి అన్నారు. ఆదివారం మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక ఫంక్షన్ హాల్ లో డివిజన్ పరిధిలోని వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. మండపాలు ఏర్పాటు చేసేవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. మండపాల వద్ద ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా కోరారు. ప్రతి వినాయక మండపానికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. దీనివల్ల జియో ట్యాగింగ్ ఏర్పాటు చేయడంతోపాటు పోలీసుల పర్యవేక్షణకు సులభంగా ఉంటుందని తెలిపారు. ఏయే ప్రాంతంలో ఎన్ని వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశామో తెలుస్తుందని తెలిపారు. సాధ్యమైనంత వరకు నిర్వాహకులు నవర ాత్రుల్లోనే వినాయక నిమజ్జనం చేయాలని సూచించారు. కొందరు నిర్వాహకులు నవరాత్రులు పూర్తయిన చాల రోజుల తర్వాత ఇష్టారీతిగా నిమజ్జనాలు చేయడాన్ని తప్పుబట్టారు. వినాయక మండపాలు, నిమజ్జన సమయాల్లో డీజేలకు ఎటువంటి అనుమతి లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మేడిపల్లి సీఐ గోవింద్ రెడ్డి, ఉప్పల్ సీఐ భాస్కర్, ఘట్కేసర్ సీఐ బాలస్వామి, నాచారం సీఐ రవి, పోచారం సీఐ రుద్ర కుమార్ ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్ఐ లు పాల్గొన్నారు.



## వినాయక మండపాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

### మేడిపల్లి సీఐ గోవిందరెడ్డి



**మేడిపల్లి, ఆగస్టు17 (క్విక్ టుడే న్యూస్):**

వినాయక మండపాల ఏర్పాటుకు సంబంధించిన వివరాలను నిర్వాహకులు కచ్చితంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని మేడిపల్లి సీఐ గోవిందరెడ్డి తెలిపారు. వినాయక ఉత్సవాలను పండుగ వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. మండపాలను ఏర్పాటు చేసే క్రమంలో రోడ్డుకు పూర్తిగా అడ్డంగా కాకుండా వాహనాలు వెళ్లే విధంగా ఉండాలని నిర్వాహకులకు సూచించారు. మండపాల్లో వినియోగించి విద్యుత్ వైర్లు షార్ట్ సర్క్యూట్ కాకుండా జాగ్రత్తపడాలని, ఇందుకోసం నాణ్యమైన విద్యుత్ తీగలను వాడాలని తెలిపారు. రాత్రి 10గంటల వరకు సౌండ్ బాక్సులను వినియోగించాలని, ఇతరులకు ఇబ్బంది కలిగేవిధంగా వ్యవహరించొద్దని సూచించారు. కోర్టు ఆదేశాల మేరకు డీజే బాక్సులకు అనుమతి లేదని, ఇందుకు సంబంధించి ప్రభుత్వం జీవో ఉందని తెలిపారు. పెద్దపెద్ద వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేటప్పుడు ముందు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. వినాయక మండపాల వద్ద గొడవలుపడకుండా నిర్వాహకులు తమ దృష్టికి తీసుకురావడంలో జాగ్రత్త పడాలని సూచించారు.

## స్వదేశానికి చేరుకున్న శుభాంశు శుక్లా



యాత్ర పూర్తి చేసుకున్నాక అమెరికాలో ఉన్న ఆయన, ఆదివారం తెల్లవారుజామున భారత్‌కు చేరుకున్నారు. ఆయన విమానం ఢిల్లీలోని ఐజిఐ విమానాశ్రయంలో ల్యాండ్ అయింది. ఆయనకు భార్య కామ్నా శుక్లా, కుమారుడు సమక్షంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా విద్యార్థుల బృందం, పెద్ద సంఖ్యలో ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. శుభాంశు శుక్లా కు ప్రజలు భారత్ మాతా కీ జై అంటూ నినాదాలు చేస్తూ, జాతీయ పతాకంతో ఘన స్వాగతం పలికారు. కాగా ఆయన ఈ రోజు ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలువనున్నారు. తన స్వస్థలమైన లక్నోను సందర్శిస్తారు. ఆగస్టు 22-23 తేదీలలో జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారు.ఈ సందర్భంగా జితేంద్ర సింగ్ మాట్లాడుతూ శుభాంశు శుక్లా స్వదేశానికి చేరుకోవడం భారత్‌కు ఎంతో గర్వకారణమైన క్షణమని అభివర్ణించారు. " ఇది భారతదేశానికి గర్వకారణమైన క్షణం! ఇస్రోకు కీర్తినిచ్చే క్షణం! ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దీనికి దోహదపడిన వ్యవస్థకు కృతజ్ఞత తెలుపుతూ, దేశ అంతరిక్ష వైభవం భారత గడ్డను తాకిందన్నారు. భారతమాత దిగ్గజ పుత్రుడు శుభాంశు శుక్లా ఈరోజు తెల్లవారుజామున ఢిల్లీలో అడుగుపెట్టారన్నారు. ఆయనతో పాటు మిషన్ గగన్‌యాన్‌కు ఎంపికైన వ్యోమగాముల్లో ఒకరైన గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్ కూడా ఉన్నారు" అని కేంద్ర మంత్రి తెలిపారు. కాగా, యాక్సియం-4 మిషన్ విజయవంతం తర్వాత తొలిసారి భారత్‌కు వస్తున్నానంటూ శుక్లా శనివారం పోస్టు ద్వారా తెలిపారు.తను స్వదేశానికి తిరిగి వచ్చేందుకు విమానంలో కూర్చున్నప్పుడు భావోద్వేగానికి గురైనట్లు చెప్పారు. మిషన్ కోసం గతేడాది నుంచి తన స్నేహితులు, కుటుంబసభ్యులకు దూరంగా ఉండాల్సి వచ్చిందని వెల్లడించారు. ఇది తనను ఎంతో బాధించిందని వాపోయారు. వారిని కలిసి తన అనుభవాలను పంచుకునేందుకు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నానని పేర్కొన్నారు. రోదసిలో 18 రోజులు గడిపి మానవాళికి ప్రయోజనం కలిగించే పలు ప్రయోగాలను నిర్వహించిన శుభాంశు శుక్లా బృందం జులై 15న భూమికి తిరిగి వచ్చింది. ఆ వెంటనే వ్యోమగాములను క్వారంటైన్ సెంటర్‌కు తరలించారు. వ్యోమగామి శుభాంశు శుక్లాతో పాటు పెగ్గీ విట్సన్ (అమెరికా), స్లావోస్జ్ ఉజ్నాన్స్కి (పోలండ్), టిబర్ కపు ఈ బృందంలో ఉన్నారు. శుభాంశు శుక్లా అంతరిక్షంలో 60 కి పైగా శాస్త్రీయ ప్రయోగాలు, 20 అవేర్ నెస్ సెషన్లను నిర్వహించారు. ఆక్సియం-4 మిషన్ కోసం, శుభాంశు శుక్లా అమెరికాలో ఒక సంవత్సరం పాటు కఠిన శిక్షణ తీసుకున్నారు. జూన్ 25, 2025న, అతను ఫ్లోరిడాలోని కేప్ కెనావెరల్ నుంచి స్పేస్‌ఎక్స్ డ్రాగన్ క్యాప్సూల్ ద్వారా అంతరిక్షానికి బయలుదేరారు. మరుసటి రోజు, జూన్ 26న, అతను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) చేరుకున్నాడు. భారతదేశ అవసరాలను దృష్టిలో ఉంచుకుని శుభాంశు శుక్లా అంతరిక్షంలో ఏడు ముఖ్యమైన ప్రయోగాలపై పనిచేశాడు. వీటిలో అంతరిక్షంలో పచ్చి శనగలు, మెంతుల అంకురోత్పత్తి, శరీరంపై స్థలం ప్రభావం అధ్యయనం, కండరాల బలహీనత, మెదడు -కంప్యూటర్ ఇంటర్‌ఫేస్ వంటి అంశాలు ఉన్నాయి. ఈ ప్రయోగాలు భారతదేశ శాస్త్రీయ పరిశోధనలకు కొత్త దిశానిర్దేశం చేయడమే కాకుండా, భవిష్యత్తులో వ్యవసాయం, మానవ ఆరోగ్యం, అంతరిక్షంలో సాంకేతిక అభివృద్ధిలో గణనీయమైన సహకారాన్ని అందించనున్నాయి.

## దీపావళికి డబుల్ ధమాకా

### జీఎస్టీ సంస్కరణలు చేపడుతున్నాం

### నాలుగు బదులు రెండు స్లాబుల సిస్టం

### నిత్యావసరాలపై 5 శాతం, ఇతర వస్తువులపై 18 శాతం పన్ను ప్రతిపాదన

### ఢిల్లీలో రెండు ప్రధాన రహదారులను ప్రారంభించిన ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ, ఆగస్టు17:**

ఈసారి దీపావళికి దేశ ప్రజలకు డబుల్ బోనస్ దక్కబోతోందని ప్రధాని మోదీ ప్రకటించారు. వస్తు, సేవల ధరలను తగ్గించి పేద, మధ్యతరగతి వర్గాలకు మేలు చేకూర్చేందుకు జీఎస్టీలో తర్వాతి తరం సంస్కరణలు తీసుకురానున్నట్లు ఆయన వెల్లడించారు. ఆదివారం ఢిల్లీలో రెండు ప్రధాన రహదారి ప్రాజెక్టులను ప్రారంభిస్తూ ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. సుపరిపాలన విస్తరణే తమకు సంస్కరణ అని పేర్కొన్న ప్రధాని, ప్రజల జీవితాలను, వ్యాపారాలను సులభతరం చేసేందుకు రానున్న రోజుల్లో మరిన్ని సంస్కరణలు రానున్నాయని తెలిపారు. "ఈ ప్రయత్నంలో భాగంగా జీఎస్టీలో తర్వాతి తరం సంస్కరణలు రాబోతున్నాయి. ఈ దీపావళికి జీఎస్టీ సంస్కరణల రూపంలో పౌరులకు డబుల్ బోనస్ లభిస్తుంది" అని మోదీ అన్నారు. ఈ సంస్కరణలకు సంబంధించిన పూర్తి ఫ్రేమ్‌వర్క్‌ను అన్ని రాష్ట్రాలకు పంపించామని, ఈ ప్రక్రియను వేగంగా పూర్తి చేయడానికి అన్ని రాష్ట్రాలు సహకరించాలని ప్రధాని కోరారు. మరోవైపు, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇప్పటికే జీఎస్టీ కౌన్సిల్‌కు కీలక ప్రతిపాదనలు పంపింది. ప్రస్తుతం ఉన్న 5 శాతం, 12 శాతం, 18 శాతం, 28 శాతం అనే నాలుగు శ్లాబుల స్థానంలో... కేవలం 5 శాతం, 18 శాతం అనే రెండు శ్లాబులను మాత్రమే అమలు చేయాలని ప్రతిపాదించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కొత్త విధానంలో సామాన్యులు వినియోగించే నిత్యావసరాలు, ఆరోగ్య సంబంధిత వస్తువులు, హస్తకళలు, ఇన్సూరెన్స్ వంటి వాటిపై 5 శాతం పన్ను ఉంటుంది. ఫ్రిజ్, టీవీ వంటి ఇతర తయారీ వస్తువులపై 18 శాతం పన్ను విధిస్తారు. అయితే, సిగరెట్లు, పొగాకు, చక్కెర పానీయాలు, పాన్ మసాలా వంటి లగ్జరీ, హానికర వస్తువులపై 40 శాతం ప్రత్యేక పన్ను విధానం యథాతథంగా కొనసాగుతుంది. ఈ ప్రతిపాదనపై చర్చించి ఆమోదం తెలిపేందుకు జీఎస్టీ కౌన్సిల్ సెప్టెంబరులో సమావేశమయ్యే అవకాశం ఉంది. ఈ పన్నుల హేతుబద్ధీకరణ ద్వారా దేశంలో వినియోగం పెరిగి, ఆర్థిక వృద్ధికి ఊతం లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మార్పులు ప్రతి ఇంటికీ, ముఖ్యంగా పేద, మధ్య తరగతి కుటుంబాలకు మేలు చేస్తాయని, అలాగే వ్యాపారులు, పారిశ్రామికవేత్తలకు కూడా ప్రయోజనం చేకూరుస్తాయని ప్రధాని వివరించారు.

